క్లుప్తంగా

సేవాభావం అభినందనీయం

● నగర మేయర్ గంగాడ సుజాత



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ గంగాడ సుజాత, క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: సేవాభావంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. స్థానిక ఎన్నీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ 37వ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇండియన్ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు మాంటిస్సోరి ప్రకాష్‌బాబు చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం జరిగింది. ప్రెసిడెంట్‌గా వెన్నపూస శ్రీరాములురెడ్డి, సెక్రటరీగా నోబెల్ చరియన్, ట్రెజరర్‌గా అడపాల వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. రీజినల్ చైర్మన్ సోమినేని సురేష్, శాండిల్య, వేమూరి బుజ్జి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పశువుల సంతను తెరిపించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చీమకుర్తి: సంతనూతలపాడు మార్కెట్ యార్డు కార్యాలయ ప్రాంగణంలో కొంత కాలంగా మూతపడిన పశువుల సంతను తిరిగి తెరిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దాసరి రవి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం సంతనూతలపాడు మార్కెట్ యార్డు ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. పశువుల సంత నిర్వహించడం వలన నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన పశుపోషకులు వారి పశువుల క్రయ విక్రయాలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. దానివలన మార్కెట్ యార్డుకు కూడా రూ.10 లక్షల ఆదాయం వస్తుందన్నారు. వెంటనే సంతను పునరుద్ధరించాలని మార్కెట్ యార్డు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు మండల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థినులు

● క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మార్కాపురం: మార్కాపురం శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థినులు ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు వారం క్రితం సాయంత్రం పూట ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లారు. రాత్రి సమయంలో ఇద్దరు విద్యార్థినులు పాఠశాలలో లేని విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తమ సిబ్బందితో తెల్లవార్లూ వెతికి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు గుర్తించి పాఠశాల సిబ్బందికి అప్పగించారు. మార్కాపురం మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన ఆ విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారమిచ్చి ఇంటికి పంపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సునీతను వివరణ కోరగా.. ఇద్దరు విద్యార్థినులు బయటకు వెళ్లిన మాట వాస్తవమేనని, ప్రస్తుతానికి ఆ ఇద్దరిని తల్లిదండ్రుల వద్దకు పంపినట్లు తెలిపారు.

13న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

మార్కాపురం: రజక విద్యా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన ఒంగోలులోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో 10వ తరగతిలో 450కి పైగా మార్కులు సాధించిన రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని సంఘ నాయకులు దేవలూటి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక నగదు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు 80966 46072 వాట్సాప్ నంబరుకు వివరాలు పంపాలని సూచించారు.

పరుగులు తీస్తున్న అభివృద్ధి

● రూ.26 లక్షలతో అభివృద్ధి పనులకు ఎంపీపీ, జెడ్పీటీసీ శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు

చీమకుర్తి: మండలంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాస రావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాస రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు తెలిపారు. బూదవాడ సచివాలయం పరిధిలో రూ.26 లక్షలతో అభివృద్ధి పనులకు ఆదివారం వారు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాలు నిర్మాణం, రూ.16 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, ఎంపీటీసీ చిన్నపురెడ్డి సుశీలమ్మ పాపిరెడ్డి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఉద్యమ దిక్సూచి.. చుండూరు



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు: చుండూరులో జరిగిన నరమేధం షెడ్యూల్డ్ కులాల ఉద్యమ దిక్సూచి అని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. స్థానిక దళిత హక్కుల పరిరక్షణ కార్యాలయంలో ఆదివారం చుండూరు నరమేధం 32వ స్మారక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత నరమేధం నుంచి ఆవిర్భవించిన దళిత ఉద్యమం దేశానికి తొలి ఎస్సీ రాష్ట్రపతిని, ఎస్సీ, ఎస్టీలకు వజ్రాయుధమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అందించిందన్నారు. 1991 ఆగస్టు 6వ తేదీ ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చుండూరు మాలపల్లెపై రెడ్డి హంతకుల ముఠా మారణకాండ జరిపిందన్నారు. పది మంది అమరులయ్యారని, న్యాయం కోసం రోడ్డెక్కినప్పటికీ ఆనాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి దమనకాండ సాగించారని గుర్తు చేశారు. మృతదేహాలను చుండూరు నడిబొడ్డులో ఖననం చేయడంతో రక్తక్షేత్ర చరిత్రగా మిగిలిందన్నారు. 109 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఎంపీల ఆత్మగౌరవ పోరాట ఫలితంగా కేఆర్ నారాయణన్ రాష్ట్రపతి అయ్యారని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల నాయకులు దారా అంజయ్య, దేవరపల్లి రమణయ్య, ముత్తన పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో...

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ గ్రంథాలయంలో ఆదివారం చుండూరు మృతవీరుల సంస్మరణ సభ జరిగింది. పేముల యోహాను, జై భీమ్ పాంథర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు రమేష్ పాల్గొని మాట్లాడారు. కనమాల జయకుమార్, మన్నం రమేష్, షేక్ జిలాని, డీబీపీ పార్టీ నాయకులు పాల్గొని అమరులకు నివాళులర్పించారు.

ఎంపీ మాగుంట సహకారంతో రోడ్డు పనులు ప్రారంభం



గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

అల్లూరు (కొత్తపట్నం): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సహకారంతో అల్లూరు గ్రామంలో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన జేసీబీ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అధ్యక్షతన ఆదివారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. గ్రామానికి 16 గ్రావెల్ రోడ్లు మంజూరవగా, కోడేళ్ల డొంకలో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నారు. ముందుగా చదును చేయడానికి, చిల్లచెట్లు తొలగించడానికి, రోడ్డుకిరువైపులా మార్జిన్, గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి జేసీబీ సమకూర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎంపీ మాగుంట జేసీబీ ఇవ్వడం వలనే గ్రావెల్ రోడ్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నారని తెలిపారు. మాగుంట సహకారంతో అల్లూరు గ్రామంలో 16 రోడ్లు పూర్తి చేస్తామని చెప్పారు. నాయకులు, గ్రామస్తులు మాగుంటకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మిట్నసల శాంతారావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నానిరెడ్డి పేరారెడ్డి, ఉప సర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ స్వర్ణశివారెడ్డి, పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు జెట్టి రామకృష్ణారెడ్డి, గరటారెడ్డి, బుర్ల సుధాకర్‌రెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ పిరికాల రాముడు, స్కూల్ చైర్మన్ శత్రుఘ్న, సన్నగిరి వెంకటస్వామి, కొండ్రు నరేష్, వెంకారెడ్డి, లక్కంతోటి కృపారావు, కొత్త దేవదాసు, మొలకా యాకోబు, దర్శిగుంట చిన్న జాలయ్య, పాల్గొని టెంకాయలు కొట్టి పూజలు చేశారు.

ఫిష్ ఎమినోయాసిడ్ ద్రావణంతో అధిక దిగుబడులు



ఫిష్ ఎమినోయాసిడ్ ద్రావణాన్ని చూపిస్తున్న మల్లేశ్వరి

కొత్తపట్నం: ఫిష్ ఎమినోయాసిడ్ ద్రావణం వాడటం వలన పైరు ఆరోగ్యంగా ఉండి అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పురిణి మల్లేశ్వరి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ ఆధ్వర్యంలో గ్రోత్ ప్రమోటర్స్‌కు ఆదివారం ఫిష్ ఎమినోయాసిడ్ ద్రావణం తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ఫిష్ ఎమినోయాసిడ్ ద్రావణం పిచికారీ చేయడం వలన చీడపీడలను అధిగమించి అధిక దిగుబడులు వస్తాయన్నారు. వేరుశనగ, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలు వంటి పైర్లకు వాడితే రైతుకు లాభం వస్తుందన్నారు. వేరుశనగలో అంతర్ పంటలుగా సరిహద్దు పంటలు, రక్షక పంటలు వేసుకోవాలని సూచించారు. పూర్తిగా ప్రకృతి కషాయాలతో తయారు చేసిన వాటిని వాడాలని సూచించారు. కార్యక్రమంలో భవాని, కోమట్ల భాగ్యలక్ష్మి, ప్రకాశ్‌రావు, రాజశేఖర్, శశి, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ప్రజల భాషకు పట్టం కట్టిన కథలు



ప్రరవే చర్చావేదికలో పాల్గొన్న రచయిత్రులు, కవులు

ఒంగోలు టౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా కథా రచయిత్రులు, రచయితలు ప్రజల భాషకు పట్టం కట్టడం మంచి పరిణామమని ప్రసిద్ధ కవి ఖాదర్ మొహిద్దీన్ అన్నారు. ఒంగోలు నగరంలోని రాంనగర్ ఎంఎస్ రెసిడెన్సీలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో దశాబ్ది కథానాయికలు కొందరు అనే పేరుతో కథల నేపథ్యం, విశ్లేషణలపై ఆదివారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్ మొహిద్దీన్ ప్రసంగిస్తూ.. వాస్తవ జీవితాన్ని ఎలుగెత్తే రచనలు మరింత విస్తృతంగా రావాల్సిన అవసరం ఉందన్నారు. చైతన్య స్థాయిలో తెలుగు మహిళలు చాలా ముందున్నారని చెప్పారు. తెలుగు కథల విస్తృతి రోజురోజుకు విస్తరిస్తుందన్నా ఆయన నోరులేని వారి గొంతుకలను మరింత బలంగా వినిపించాలని సూచించారు. రచయితలు కథలలో ఉపయోగించే భాష విషయంలో స్వాగతించదగిన మార్పులు వస్తున్నాయన్నారు. కథలు ఎక్కడి నుంచో పుట్టవని, నిత్య జీవితంలోని అనుభవాలు రచనలకు ప్రేరణ ఇస్తాయని ప్రరవే రాష్ట్ర అధ్యక్షురాలు పి.రాజ్యలక్ష్మి అన్నారు. మహిళలలో పెరుగుతున్న చైతన్యంతో పాటుగా సమస్యలు కూడా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్య విషాదాలతో అనునిత్యం పోరాడాల్సిన పరిస్థితులు కలతకు గురిచేస్తున్నాయన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రరవే రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు జాతీయ కార్యదర్శి కేఎన్ మల్లీశ్వరి తెలిపారు. మహిళల సమస్యలు పురుషులు కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ రచయిత్రి షేక్ సలీమా అన్నారు. సమావేశంలో భాగంగా నాలుగు సెషన్స్‌లో మహిళల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. డా.జె. కనకదుర్గ, ఖాదర్ మొహిద్దీన్, ఆదిత్య కొర్రపాటి, పుప్పాల శ్రీరాం కథలను విశ్లేషించారు. ఎండ్లూరి మానస సమన్వయకర్తగా వ్యవహరించగా, ప్రముఖ కథా రచయిత ఖదీర్‌బాబు, మహిళా ఉద్యమకారిణి దీప్తి, డీఎల్ సుహాసిని, పి.అమరజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య వీరుడు.. గద్దర్



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

చీమకుర్తి: సామాజిక హక్కుల కోసం పోరాటం సాగించిన గద్దర్.. సామాజిక చైతన్య వీరుడని చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాస రావు అన్నారు. గద్దరు మృతిచెందడంతో ఆదివారం చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. దళిత గిరిజన వర్గాల జీవితాలలో వెలుగులు నింపడం కోసం విప్లవ గీతాలతో గద్దర్ చైతన్యం నింపారన్నారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నివాళులర్పించిన వారిలో దూపాటి సత్యం, కూడలి మాలకొండయ్య, ఇనగాల శ్రీరాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరని లోటు

ఒంగోలు టౌన్: గద్దర్ మరణం సాంస్కృతికోద్యమానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా సీపీఐ సమితి ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. రాంనగర్ ఎంఎస్ రెసిడెన్సీలో జరిగిన ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక సదస్సులో రచయిత్రులు, కవులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ మాదిగ, నాయకులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.







